క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు ఆటంకం

నరసాపురం: పట్టణంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు నరసాపురం ఎలక్ట్రికల్ ఈఈ బళ్ల సురేష్ కుమార్ గురువారం చెప్పారు. క్రిస్టియన్‌పేట, స్టేషన్ పేట, జవదాలపేట, నాగారమ్మగుడి ఏరియా, బస్టాండ్ ఏరియా, రుస్తుంబాద, రాయిపేట, మొగల్తూరు రోడ్డు ప్రాంతాల్లో ఉదయం 8 గంటలు నుంచి మధ్యాహ్నం 12 గంటలు వరకూ విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు చెప్పారు. ప్రజలు గమనించి సహకరించాలని చెప్పారు.

ఆర్‌డీకి సత్కారం


ఆర్‌డీ సత్యనారాయణను సత్కరిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): పదోన్నతిపై మున్సిపల్ రీజినల్ డైరెక్టర్‌గా రాజమండ్రికి బదిలీపై వెళుతున్న ఎన్‌వీవీ సత్యనారాయణను మున్సిపల్ మినిస్టీరియల్ సంఘం తరుపున గురువారం ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న భీమవరం మునిసిపల్ కమిషనర్ శివరామకృష్ణ మాట్లాడుతూ సత్యనారాయణ మరిన్ని ఉన్నత స్థానాలు పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.శివాజీ, పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడు ఎస్.వెంకట రమణ, తూర్పుగోదావరి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సాయి పాషా, సాయిరామ్, కాకినాడ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వైవీ మోహన్ రంగా, చల్లా త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష తులసి పూజ


కొంతేరులో నిర్వహించిన లక్ష తులసి పూజ

యలమంచిలి: వైశాఖ శుద్ధ చతుర్దశి నరసింహ జయంతి సందర్భంగా గురువారం కొంతేరు గ్రామంలోని శ్రీకుంతీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో లక్ష తులసి పూజ నిర్వహించారు. ఆలయ అర్చకులు పూలపల్లి వేణునాథ్‌ఆధ్వర్యంలో పది మంది వేద పండితులు ఈ పూజ చేశారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి వచ్చి స్వామిని దర్శించుకున్నారు. ముందుగా కలశతో ఆలయ ప్రదక్షిణ చేసి అనంతరం తులసి పూజ చేశారు. పూజ అనంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ జరిగింది.

చురుగ్గా మంచినీటి పైప్‌లైన్ నిర్మాణ పనులు

నరసాపురం రూరల్: నరసాపురం మండలం మల్లవరం పెదలంక గ్రామంలో సాగునీటి కష్టాలు తీరనున్నాయి. ఈ గ్రామంలో మంచినీటి సమస్య పరిష్కారానికి, రెండుపూటలా సమృద్ధిగా మంచి నీరు అందించేందుకు స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు జలజీవన్ మిషన్ నిధులు రూ.30 కోట్లు మంజూరు చేయిచారు. దీంతో గ్రామంలో పైప్ లైన్ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఈ పనులను గురువారం గ్రామ సర్పంచ్ గొట్టుముక్కల సుజాత, ఉప సర్పంచ్ యేలూరి కృష్ణాజీ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ గ్రామంలో ఈ పనులు పూర్తయినట్లయితే సుమారు 300 కుటుంబాలకు సమృద్ధిగా మంచినీరు అందుతుందన్నారు. సుమారు 2500 మీటర్ల మేర పైప్‌లైన్ పనులు వేగంగా జరుగుతున్నాయి.

చిన్నారులకు బైబిల్ శిక్షణా తరగతులు

పాలకొల్లు అర్బన్: బైబిల్‌లోని విషయాలపై బాల్య దశ నుంచి అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని పాస్టర్ జాన్ సామ్యూల్ అన్నారు. యాళ్లవానిగరువులో గల ఎల్‌ఈఎఫ్ చర్చిలో చిన్నారులకు నిర్వహిస్తున్న బైబిల్ శిక్షణా తరగతుల్లో గురువారం ఆయన పాల్గొని చిన్నారులకు పలు అంశాల్లో అవగాహన కల్పించారు. చిన్నతనం నుంచి ఆధ్యాత్మిక భావన అనే విత్తనాన్ని నాటితే క్రమశిక్షణ గల పౌరులుగా వారు ఎదుగుతారన్నారు. మేరీ పెర్సిస్, జాన్సన్, యువజనులు పాల్గొన్నారు.

రేపటి నుంచి వేసవి శిక్షణా తరగతులు

పాలకొల్లు సెంట్రల్: విద్యా చైతన్య సమాఖ్య ఆధ్వర్యంలో ఉచిత వేసవి శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు సమాఖ్య అధ్యక్షులు మెరిపే శ్రీనుబాబు గురువారం చెప్పారు. శనివారం నుంచి 15వ తేదీ వరకు స్థానిక ఎంఎంరకేఎస్‌ఎం హైస్కూల్‌లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు శిక్షణ తరగతులు జరుగుతాయన్నారు. భౌతిక, రసాయన, జీవశాస్త్రం, మెంటల్ ఎబిలిటీ, పేపర్ క్రాఫ్ట్ తదితర అంశాల్లో శిక్షణ ఇస్తామన్నారు. పాలకొల్లు పరిసర ప్రాంతాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పూర్తి వివరాల కోసం 98490 06368, 94410 73902 సెల్ నంబర్లలో సంప్రదించాలన్నారు. సమాఖ్య కార్యదర్శి పోలిశెట్టి శ్రీశ్రీ, మంచెం ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను ప్రోత్సహించొద్దు

పాలకోడేరు: బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని అలాంటి వాటిని ప్రోత్సహించవద్దని ఆకివీడు ఐసీడీఎస్ సీడీపీఓ వాణి విజయరత్నం అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో బాల్య వివాహాలపై బ్రాహ్మణులు, పాస్టర్లు, ముస్లిం పెద్దలతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో వివాహాలపై అవగాహన లేనివారు, మంచి సంబంధం వచ్చిందని అంగీకరించే వారు ఉంటారని అటువంటివారు మిమ్మల్ని సంప్రదిస్తే తమకు సమాచారం అందించాలని కోరారు. పురోహితులు, పాస్టర్లు, ముస్లిం పెద్దలు బాల్య వివాహాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. బాల్య వివాహాలు చేయడానికి ప్రయతిన్తే సమాచారాన్ని మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు, ఇతర ప్రభుత్వ శాఖ అధికారులకు సమాచారం అందించాలని కోరారు. బాల్య వివాహాల కారణంగా బాలికలు భవిష్యతులో తీవ్ర అనారోగ్యాలకు గురికావడం, వారికి పుట్టే శిశువుల ఆరోగ్యంపై ప్రభావం పడుతుందన్నారు. మత పెద్దలకు తల్లిదండ్రులకు ఈ విషయాలపై అవగాహన కల్పించాలని అంగనవాడీ వర్కర్లకు సూచించారు. ఈ సమావేశంలోఎంపీడీవో నూకల మురళీ గంగాధర్‌రావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పార్వతీ సుజాత తదితరులు పాల్గొన్నారు.


పాలకోడేరులో సదస్సులో మాట్లాడుతున్న ఐసీడీఎస్ అధికారులు


కార్యక్రమంలో మాట్లాడుతున్న తహసీల్దార్ వై.రవికుమార్

సహకరించినా శిక్ష తప్పదు

భీమవరం అర్బన్: యువతులకు 18, యువకునికి 21 సంవత్సరాలు దాటితేనే వివాహాలకు మతపెద్దలు అనుమతించాలని తహశీల్దార్ వై. రవికుమార్ అన్నారు. భీమవరంలోని తహసీల్దార్ కార్యాలయంలో గురువారం పాస్టర్లు, మతపెద్దలు, ముస్లిం మౌజానాలకు బాల్య వివాహాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ యువతీయువకులకు వయో పరిమితి దాటకుండా వివాహాలు చేస్తే పోక్సో చట్టం ద్వారా శిక్ష తప్పదన్నారు. బాల్య వివాహాల వల్ల ఇద్దరి జీవితాలపై సరైన పరిపక్వత లేక రెండు, మూడేళ్లకే కొట్లాటలు, గొడవలు జరిగి విడాకులకు వరకు వెళుతున్నాయన్నారు. చిన్నతనంలో వివాహాలు చేసుకోవడం వల్ల అనారోగ్య పరిస్థితులకు దారి తీస్తున్నాయన్నారు. మత పెద్దలు, పాస్టర్లు, ముస్లిం మౌజానాలు యువతీ యువకులకు వివాహం చేసే ముందు వారి వయస్సును తెలుసుకుని వయోపరిమితి దాటితేనే వివాహాలకు అనుమతించాలన్నారు. విధిగా గ్రామాలలో బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించాలని వివిధ శాఖల అధికారులకు సూచించారు. బాల్య వివాహాలు చేస్తే తల్లిదండ్రులతో పాటు ప్రేరేపించిన వారిపై కూడా శిక్షలు అమలులో ఉన్నాయని హెచ్చరించారు. ఈ అవగాహన సదస్సులో ఎంపీడీవో రామచంద్ర ప్రభు, మండల విద్యాశాఖాధికారి బి. వినాయకుడు, భీమవరం ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి లక్ష్మీకాంతం, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

8 నుంచి వేసవి శిక్షణ శిబిరం

సాక్షి, భీమవరం: పట్టణంలోని వైఎస్సార్ శాఖా గ్రంథాలయంలో బాలలకు ప్రభుత్వం పౌరగ్రంథాలయశాఖ, జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 8 నుంచి ఉచిత వేసవి విజ్ఞాన శిబిరం (సమ్మర్ క్యాంప్) నిర్వహించనున్నట్లు గ్రంథాలయాధికారి ఎస్.వెంకటేశ్వరరావు చెప్పారు. గురువారం గ్రంథాలయ ఆవరణలో వివరాలను వెల్లడించారు. 10 నుంచి 15 ఏళ్లలోపు బాలబాలికలకు కోసం రిటైర్డ్ ఉద్యోగులు. శ్రీవిజ్ఞానవేదిక, అరసవల్లి వెంకటాచారి చారిటబుల్ ట్రస్ట్ సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ శిబిరంలో నీతి కథలు నేర్పించడం, గ్రంథాలయంలో పుస్తకాలు చదివించడం , డ్రాయింగ్, డ్యాన్స్, స్పోకెన్ ఇంగ్లిష్, యోగ, క్రాఫ్టు, బ్యూటీ టిప్స్‌తోపాటు విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి సంబంధించిన వివిధ అంశాలను అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే నేర్పిస్తామన్నారు. జూన్ 16వ తేదీ వరకు నిర్వహించే ఈ శిక్షణా శిబిరం ప్రతిరోజు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వెంకటేశ్వరరావు కోరారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ చదువరుల సంఘం అధ్యక్షుడు అరసవల్లి సుబ్రహ్మణ్యం, చెరుకువాడ రంగసాయి, కలిగొట్ల గోపాలశర్మ పాల్గొన్నారు.


వివరాలు వెల్లడిస్తున్న శిబిరం ప్రతినిధులు

ఉక్కు ప్రైవేటీకరణను నిరసిస్తూ ధర్నా

ఆకివీడు: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ప్రతిపాదనలతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రానున్న ఎన్నికల్లో తుక్కుతుక్కుగా ఓడిపోనుందని సీపీఎం పట్టణ కమిటీ కార్యదర్శి కె.తవిటినాయుడు హెచ్చరించారు. స్థానిక వైఎస్సార్ సెంటర్‌లో గురువారం విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు నిరసనగా ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు స్టీలు ప్లాంట్‌లకు గనులు కేటాయించిన కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థగా ఉన్న విశాఖ ఉక్కు ఫ్యాక్టరీకి గనులు కేటాయించడపోవడం దారుణమన్నారు. ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణకు నిరసనగా అన్ని పార్టీలు పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఎస్కే.వలీ, డోకల రవితేజ, బొక్కా వెంకట వర్మ, నెల్లి సూరిబాబు పాల్గొన్నారు.


ఆకివీడులో ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

కాళ్లకూరు వెంకన్నకు ప్రత్యేక పూజలు

కాళ్ల: కాళ్లకూరులోని స్వయంభూః శ్రీ వేంకటేశ్వర స్వామివారి దేవస్థానంలో గురువారం శ్రీస్వామివారి కల్యాణ మహోత్సవంలో భాగంగా గురువారం స్వామివారికి నిత్యార్చన, బలిహరణ, నిత్యోపాసన పూజలు, శ్రీస్వామి, అమ్మవార్లకు కనకాంబర పుష్పాలతో సహస్రనామ పుష్పార్చన పూజలు నిర్వహించారు. శ్రీ లక్ష్మీ నృసింహ జయంతి సందర్భంగా ఆలయ వేద పండితులు అనిపెద్ది ఫణికుమార్‌శర్మ ఆధ్వర్యంలో ప్రముఖ దేవాలయాల వేద పండితుల మధ్య వేద విద్వత్ సభ ఘనంగా జరిపారు. శ్రీ స్వామి అమ్మవార్లకు సదస్య కార్యక్రమం, నీరాజన మంత్రపుష్పములు స్వామివారికి వేద మంత్రోచ్చారణల మధ్య పందిరి (సర్వభూపాల) వాహన సేవ గ్రామోత్సవం జరిపారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండగా దేవస్థానం కార్యనిర్వహణాధికారి శ్రీ మోకా అరుణ్ కుమార్, దేవస్థానం పాలకమండలి అధ్యక్షులు దండు వెంకట కృష్ణంరాజు పాలకమండలి సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.


ప్రత్యేక అలంకరణలో స్వామి అమ్మవార్లు

దూరప్రాంతాల్లో ఉన్నా పింఛను అందజేత


ఫించను అందిస్తున్న తూర్పుపాలెం వలంటీరు కడలి తులసి, గృహసారథి ఇర్రింకి శ్రీనివాస్


అమలాపురం ఆసుపత్రిలో లబ్ధిదారుడికి పింఛను అందిస్తున్న వలంటీరు నాగేంద్ర

పోడూరు: శస్త్రచికిత్స చేయించుకున్న వింతంతువు వద్దకు వెళ్లి ఫించను అందించి అంకితభావం చాటుకున్నారు తూర్పుపాలెం వలంటీరు, గృహసారథి. తూర్పుపాలెం గ్రామానికి చెందిన వితంతువు నూటికుర్తి సూర్యకుమారి ఐదు రోజుల కిందట తణుకులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో లివర్ ఆపరేషన్ చేయించుకున్నారు. శస్త్రచికిత్స అనంతరం ఆమె తణుకులోనే కుమారుడు ఇంటి వద్ద ఉంటున్నారు. దీంతో ఈ నెల 3వ తేదీన సాయంత్రం గ్రామ వలంటీరు కడలి తులసి, గృహసారథి ఇర్రింకి శ్రీనివాస్ తణుకు వెళ్లి సూర్యకుమారికి వితంతు పింఛను సొమ్ము రూ.2,750 అందించారు. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా వలంటీరు, గృహసారథి అంకితభావంతో విధులు నిర్వహించడంతో పలువురు గ్రామస్తులు వారిని అభినందిస్తున్నారు.

ఆసుపత్రికి వెళ్లి పింఛను అందజేత

పెనుగొండ: వలంటీర్లు నిబద్ధతను చాటుకుంటున్నారు. పింఛను లబ్ధిదారులు సుదూరు ప్రాంతాల్లో ఉన్నా వెళ్లి పింఛను సొమ్ము అందిస్తున్నారు. ఆచంట మండలం కొడమంచిలికి చెందిన పుచ్చకాయల అప్పాయమ్మ అనారోగ్యంతో అమలాపురంలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. విషయం తెలుసుకున్న వలంటీరు శీలబోయిన నాగేంద్ర, అసిస్టెంట్ రాజీకమల్ అమలాపురం ఆసుపత్రికి వెళ్లి అప్పాయమ్మకు పింఛను సొమ్ము అందించారు. నాగేంద్రను పలువురు అభినందించారు.

ప్లాస్టిక్ కవర్లు అమ్మితే చర్యలు

నరసాపురం: పట్టణంలో వ్యాపారులు ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు హెచ్చరించారు. గురువారం కమిషనర్ రైతు బజార్‌లో దుకాణాలను తనిఖీ చేశారు. వారి నుంచి ప్లాస్టిక్ కవర్లు స్వాధీనం చేసుకుని, వ్యాపారులకు ఫైన్‌లు విధించారు. కమిషనర్ మాట్లాడుతూ వ్యాపారులు ప్లాస్టిక్ కవర్లకు ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకోవాలని చెప్పారు. పర్యావరణానికి, ప్రజల ఆరోగ్యానికి హానికలిగించే ప్లాస్టిక్ విక్రయిస్తే మొదటిసారి ఫైన్‌లు విధిస్తున్నామని, రెండోసారి పట్టుబడితే షాపులు సీజ్ చేస్తామని హెచ్చరించారు. ప్రజలుకూడా ప్లాస్టిక్ కవర్లు వినయోగించకుండా సహకరించాలని కోరారు.


దుకాణదారుడి నుంచి ప్లాస్టిక్ కవర్లు స్వాధీనం చేసుకుంటున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

ఎంపీ మిథున్‌రెడ్డికి ఘన స్వాగతం


ఎంపీ మిథున్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న గ్రంధి శ్రీనివాస్, పీవీఎల్

భీమవరంలో డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు అధ్యక్షతన ఉండి, పాలకోడేరు, కాళ్ల, ఆకివీడు, మండలాల పార్టీ నాయకుల ఆత్మీయ సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సమావేశానికి విచ్చేసిన పశ్చిమ, తూర్పుగోదావరి జిల్లాల పార్టీ రీజనల్ కో-ఆర్డినేటర్, పార్లమెంట్ సభ్యులు పీవీ మిథున్ రెడ్డికి భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్, పీవీఎల్, యువజన నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఉండి నియోజకవర్గంలో మండలాల వారీగా వేరువేరుగా సమావేశం నిర్వహించారు. రాజ్య సభ సభ్యులు పిల్లి సుభాష్‌చంద్రబోస్, పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, ఎమ్మెల్యేలు గ్రంధి శ్రీనివాస్, చెరుకువాడ శ్రీరంగనాథరాజు, వైఎస్సార్ సీపీ నేత పాతపాటి శ్రీనివాసరాజు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. - కాళ్ల

ఫ్యామిలీ డాక్టర్ సేవలు వినియోగించుకోవాలి

ఆకివీడు: ఫ్యామిలీ డాక్టర్ పల్లెటూరుల్లో అందుబాటులో ఉన్నారని ఇన్‌చార్జి ఎంపీడీఓ శ్రీకర్ చెప్పారు. మండలంలోని చినకాపవరం గ్రామంలో గురువారం ఫ్యామిలీ డాక్టర్‌పై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ పల్లెటూరుకు వచ్చే ఫ్యామిలీ డాక్టర్ సేవలు సద్వినియోగం అయ్యే విధంగా సిబ్బంది సహకరించాలన్నారు. వైద్యం పొందలేక, దూరప్రాంతాలకు వెళ్లలేక ఇంట్లోనే రోగాల బారిన పడి ఉంటున్న వ్యక్తుల వివరాలు తెలుసుకుని వైద్యం అందే విధంగా కృషి చేయాలని సూచించారు. పెదకాపవరం పీహెచ్‌సీ వైద్యురాలు మెహరున్నీసా బేగం మాట్లాడుతూ బీపీ, సుగర్, చర్మవ్యాధులు, కంటి లోపాలు వంటి వాటి పట్ల నిత్యం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఫ్యామిలీ డాక్టర్ వచ్చినప్పుడు వైద్యం తప్పనిసరిగా పొందాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి నారాయణరావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.


చినకాపవరంలో ఫ్యామిలీ డాక్టర్‌తో వైద్యం పొందుతున్న పంచాయతీ సిబ్బంది

పేదలకు నిత్యావసరాల అందజేత


జిన్నూరులో పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న దృశ్యం

పోడూరు: సేవ చేయడంలో ఉండే తృప్తి వెలకట్టలేనిదని జిన్నూరు సొసైటీ చైర్మన్ డీటీడీసీ బాబు అన్నారు. జిన్నూరులో వార్షికోత్సవం సందర్భంగా గురువారం 'మనకోసం మనం' సేవాసంస్థ ఆధ్వర్యంలో రిక్షా కార్మికులకు, పారిశుధ్య కార్మికులకు డీటీడీసీ బాబు, సర్పంచ్ జమ్ము బేబీ మహాలక్ష్మి చేతులమీదుగా నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా డీటీడీసీ బాబు మాట్లాడుతూ కష్టకాలంలో ఉన్న పేదలకు సేవా సంస్థలు సహకారం అందించాలన్నారు. 'మనకోసం మనం' సేవా సంస్థ గత ఐదేళ్లుగా నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను అభినందించారు. సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు పడాల పెద్దిరాజు మాట్లాడుతూ పేదలకు, కష్టాల్లో ఉన్న వారికి బాసటగా నిలవడమే తమ సేవా సంస్థ లక్ష్యమన్నారు. ప్రజల సహకారంతో తమ సేవాసంస్థ ఆధ్వర్యంలో నిర్విరామంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పాలవలస తులసీరావు, సంస్థ సభ్యులు కలిశెట్టి కనకారావు, దాసరి సత్యనారాయణ, కలిశెట్టి లక్ష్మి, భూపతిరాజు సూర్పరాజు, గండేటి శేఖర్, రవి పాల్గొన్నారు.

సీఎం భరోసాతో రైతుల్లో ఆశలు

నరసాపురం రూరల్: రైతులను అన్ని విధాలా ఆదుకుంటామని, తడిసిన, మొలకెత్తిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధికారులకు ఆదేశాలివ్వడం, గురువారం వాతావరణం పొడిగా ఉండటంతో రైతులు ధాన్యాన్ని ఒబ్బిడిచేసే పనిలో నిమగ్నమయ్యారు. మండువేసవిలో అకాల వర్షాలతో రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. వీరి ఇబ్బందులను తొలగించాలని ప్రభుత్వం గట్టిపట్టుదలతో ఉంది. ప్రతి గింజా కొనుగోలు చేస్తామని పౌరసరఫరాల శాఖామంత్రి కారుమూరి నాగేశ్వరరావు చెప్పడం కూడా రైతులలో ధీమాను నింపింది. గోనె సంచులు కూడా అందుబాటులోకి రావడం, సాంకేతిక సమస్యలను అధిగమించడం, ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు రావడంతో అధికార యంత్రాంగంలో కదలిక వచ్చింది. నరసాపురం మండలంలో వారం రోజుల నుంచి ఏడీఏ ఈదా అనిల్‌కుమారి తన సిబ్బందితో గ్రామాల్లో పర్యటిస్తూ రైతులకు సూచనలు సలహాలు ఇస్తున్నారు. ధాన్యం సేకరణలో మిల్లర్ల నుంచి ఎటువంటి ఇబ్బంది లేకుండా తహసీల్దార్ ఫాజిల్ మల్లవరం, కొప్పర్రు, రుస్తుంబాద తదితర గ్రామాల్లోని రైస్ మిల్లులను, ఆర్బీకే సెంటర్లను పర్యవేక్షిస్తూ వీఆర్వోలకు పలు సూచనలు ఇచ్చారు. రైతులు ఇబ్బందులు పడకుండా ఏమైనా సమస్యలు ఉన్నట్లయితే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు.

బీసీ కాలనీలో సీసీ రోడ్డుకు శంకుస్థాపన

పెనుగొండ: సీఎం వైఎస్ జగన్ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కంకణం కట్టుకున్నారని మండల సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు దండు పద్మావతి అన్నారు. గురువారం ఇలపర్రులో గడపగడపకు మన ప్రభుత్వంలో మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి శ్రీకారం చుట్టారు. ఇలపర్రు సచివాలయ పరిధిలో రూ.20 లక్షల నిధులతో బీసీ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. సీఎం జగన్‌కు, మాజీ మంత్రి శ్రీరంగనాథరాజులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పడపట్ల పద్మనాగేశ్వరి, సొసైటీ ఛైర్మన్ వేండ్ర వెంకటేశ్వర్లు, వైఎస్సార్ సీపీ మండల ఉపాధ్యక్షుడు పులిదిండి వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ కేతా భీముడు, పడపట్ల మధు, గుణపాటి సంజీవరావు పాల్గొన్నారు.

ఒబ్బిడైన ధాన్యాన్ని విక్రయించుకోవాలి

భీమవరం అర్బన్: రెండు, మూడు రోజుల్లో తుపాను రానుందనే వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో కల్లాల్లో ధాన్యపు రాశులు, ఆరబెట్టిన ధాన్యాన్ని ఆర్‌బీకే సెంటర్లలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలు ద్వారా విక్రయించుకోవాలని మండల వ్యవసాయాధికారి నిమ్మల శ్రీనివాస్ రైతులకు సూచించారు. భీమవరం మండలంలోని యనమదుర్రు గ్రామంలో గురువారం రైతులకు వర్షాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సలహాలు, సూచనలు చేశారు. కల్లాల్లో ఉన్న ధాన్యపు రాశులపై టార్పాలిన్‌తో వర్షపు నీరు రాకుండా కప్పెట్టాలన్నారు. రాశులు చుట్టూ అడుగు వెడల్పుతో గొయ్యి తీసి వర్షపు నీరు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ధాన్యం తడిస్తే 100 లీటర్ల నీటిలో 5 కేజీలు ఉప్పును కలిపి పిచికారీ చేయాలని సూచించారు.

ఘనంగా సామూహిక వ్రతాలు


సామూహిక వ్రతాల్లో పాల్గొన్న భక్తులు

భీమవరం(ప్రకాశం చౌక్): పట్టణంలోని జువ్వలపాలెం రోడ్డులో వేంచేసియున్న శ్రీపద్మావతి వెంకటేశ్వరస్వామి వారి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం సామూహిక వ్రతాలు నిర్వహించారు. పద్మావతి అమ్మవారికి లక్ష కుంకుమార్చన పూజలు చేశారు. సాయంత్రం స్వామి వారి రథోత్సవం, పుష్పయాగోత్సవం తదితర పూజలు జరిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ రుద్రరాజు గంగా శ్రీదేవి, ఆలయ చైర్మన్, ధార్మిక పరిషత్ సభ్యుడు మంతెన రామ్‌కుమార్ రాజు, ధర్మకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

రాజు డాక్టర్ మృతికి సంతాపం

ఉండి: మండలంలో ఎంతో మందికి ప్రాణదాతగా నిలిచిన పెదపుల్లేరుకు చెందిన కలిదిండి రామచంద్రరాజు (రాజు డాక్టర్) బుధవారం అనారోగ్యంతో హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ మరణించారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. రాజు డాక్టర్ మృతికి ఉండి లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షుడు గాదిరాజు రంగరాజు తదితరులు సంతాపం తెలిపారు. ఆయన మరణం తీరని లోటని పలువురు గ్రామ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు.

మహిళపై దాడి

పాలకోడేరు: మహిళపై దాడి చేసిన ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై డీవీ శ్రీనివాసరావు చెప్పారు. వివరాలిలా ఉన్నాయి. పాలకోడేరు పురాణ దిమ్మె సెంటర్లో చిటికెన హేమ, ఇర్రింకి కిరణ్ చిట్టీ డబ్బుల విషయంలో బుధవారం మధ్యాహ్నం గొడవపడ్డారు. ఇది ఘర్షణకు దారి తీసి హేమపై దాడి చేసి కిరణ్ కొట్టడంతో దెబ్బలు తగిలాయి. గాయాలతో ఉన్న ఆమెను చికిత్స నిమిత్తం భీమవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి నుంచి అందిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.